• వెంకన్న వైభవం..



నరసాపురం మండలం వేములదీవి వైభవ వేంకటేశ్వర స్వామిని శనివారం పువ్వులు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించడంతో భక్తులు పరవశించారు.

పశ్చిమకు నాగరాణి.. ఏలూరుకు వెట్రిసెల్వి

కొత్త కలెక్టర్ల నియామకంతో సుమిత్‌కుమార్ చిత్తూరుకు.. జీఏడీలో రిపోర్టు చేయాలని ప్రసన్న వెంకటేశ్‌కు ఆదేశాలు



సి.నాగరాణి



సుమిత్‌కుమార్



వెట్రిసెల్వి



ప్రసన్న వెంకటేశ్

(ఏలూరు/భీమవరం టౌన్-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల కలెక్టర్లను మారుస్తూ శనివారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్రంలో జిల్లాల కలెక్టర్లను మారుస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా చదలవాడ నాగరాణిని, ఏలూరు కలెక్టర్‌గా వెట్రిసెల్విని నియమించింది. నాగరాణి గతంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా వున్నారు. కలెక్టర్ హోదాలో మొదటిసారి పశ్చిమకు నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న సుమిత్‌కుమార్‌ను చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా నియమించారు. భీమవరం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత 2022 ఏప్రిల్ 4న తొలి కలెక్టర్‌గా పి.ప్రశాంతి బాధ్యతలు స్వీకరించారు. పాలనను గాడిలో పెట్టారు. అప్పటి అధికార వైసీపీ నేతలతో ఏర్పడిన విభేదాలతో ఎన్నికల ముందు ఫిబ్రవరి 14న ఆమెను వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఆమె స్థానంలో అల్లూరి సీతారామరాజు కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ నియమించారు. ఆయన ఆధ్వర్యంలో ఎన్నికలు సమర్థవంతంగా జరిగాయి. ఆయనను చిత్తూరు కలెక్టర్‌గా బదిలీ చేయగా, ప్రశాంతిని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏలూరు జిల్లా కలెక్టర్‌గా 2014 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వెట్రిసెల్విను నియమించారు. ప్రస్తుత కలెక్టర్ వి.ప్రసన్న వెంకటేశ్‌ను జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. వెట్రిసెల్వి అత్యంత సమర్థురాలైన అధికారిణి. సీఎం చంద్రబాబు నియోజకవర్గమైన మిగతా 8వ పేజీలో..

ఫ్రీ..

ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు అందించే ఉచిత విద్య పథకం ఫీజు బకాయిలను గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. ఇది అటు పాఠశాలల యాజమాన్యాలను, ఇటు తల్లిదండ్రులను గందరగోళంలోకి నెట్టింది. గడిచిన రెండేళ్లలో 1,205 మంది విద్యార్థులకు ఫీజుల నిమిత్తం సుమారు రూ.96.40 లక్షలు బకాయిపడింది. ఈ కారణంగా ఈ ఏడాది ఈ పథకం అమలుపై నీలినీడలు అలుముకున్నాయి.

ఫీజులేవి ?

- ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య పథకం అమలుపై నీలినీడలు
- రెండేళ్లుగా ఫీజు బకాయిలు రూ.96 లక్షలు చెల్లించని గత ప్రభుత్వం
- చెల్లిస్తేనే ఈ ఏడాది అమలు చేస్తామని యాజమాన్యాల స్పష్టీకరణ.. ఆందోళనలో తల్లిదండ్రులు



భీమవరం ఎడ్యుకేషన్, జూన్ 22 : విద్యా హక్కు చట్టం 12 (10)సి ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలి. దీని ప్రకారం పేద విద్యార్థుల తల్లిదండ్రులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని మూడు కిలోమీటర్ల పరిధిలోవున్న ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. 2019 వరకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ పథకం ద్వారా ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యార్థులు చదువుకున్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీని అమలుపై చిత్తశుద్ధి లేకపోవడం విద్యార్థుల తల్లిదండ్రులకు శాపంగా మారింది. ఉచిత విద్య ద్వారా ప్రైవేట్ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం అర్బన్‌లో రూ.8 వేలు, రూరల్‌లో రూ.6,500 ఇవ్వాలి. మూడేళ్లుగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యానికి సొమ్ములు చెల్లించలేదు. పైగా ఈ విద్యార్థులకు అమ్మ ఒడి పథకం అర్హత కూడా లేదు. మరోవైపు ఫీజులు చెల్లించాలంటూ తల్లిదండ్రులపై యాజమాన్యం వత్తిడి తేవడంతో వీరు లబోదిబోమంటున్నారు.

స్కూల్ యాజమాన్యాల ఆందోళన

జిల్లాలో 2022-23 సంవత్సరానికి ఈ పథకంలో 38 మంది చేరారు. దీనిపై అవగాహన పెరగడంతో 2023-24లో 1,167 మంది విద్యార్థులు 1వ తరగతిలో చేరారు. ఈ రెండేళ్లకుగాను సుమారు రూ.96.40 లక్షల వరకు ఫీజులను ప్రభుత్వం ఇంత వరకు చెల్లించలేదు. ఈ ఏడాదిలో 2,587 మంది అర్హత సాధించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు వెళ్లగా కొన్ని ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని అడగడంతో తల్లిదండ్రుల్లో అయోమయం నెలకొంది. గతేడాది ఫీజులు పెండింగ్‌లో ఉండగా ఈ ఏడాది ఎలా చేర్చుకుంటామంటూ యాజమాన్యాలు ప్రశ్నిస్తున్నాయి. తమకు రావాల్సిన సొమ్ములకు సంబంధించి అధికారుల నుంచి భరోసా రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. గత ఏడాదికంటే ఈసారి విద్యార్థుల సంఖ్య పెరిగిందని అంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో తమకు మేలు జరుగుతుందని స్కూల్ యాజమాన్యాలు భావిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం కనిపించలేదని ఈ ప్రభుత్వం పరిష్కరిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఉచిత విద్యపథకంలో పాఠశాలల్లో చేర్పించుకునేందుకు యాజమాన్యాలు స్పందించడం లేదని భీమవరంలో విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు. పాఠశాలల్లో చేరాలంటే ఫీజు చెల్లించాలని అడుగుతున్నారని, తమకు న్యాయం చెయ్యాలని కోరారు.

కొల్లేరు కాంటూరు భూముల్లో మెరక పనుల పేరుతో చెరువులకు గట్లు వేస్తున్న మాఫియా (ఫైల్)



కొల్లేరు కొల్లగొట్టు

మెట్ట దుక్కు పేరుతో పనులకు యత్నం

- ప్రభుత్వం మారినా వెనక్కి తగ్గని మాఫియా
- రైతులను అడ్డం పెట్టుకుని చెరువులు తవ్వేందుకు రంగం సిద్ధం

కొల్లేరు కాంటూరు భూములపై మాఫియా కన్ను వీడడం లేదు. ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వంలో తమకు అనుకూలమైన వారితో సంప్రదింపులు మొదలుపెట్టారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అటవీ శాఖ అధికారులను భయపెట్టి దౌర్జన్యంగా ప్రజా ప్రతినిధుల అండతో చెరువుల తవ్వకానికి అనుకూలంగా తమ భూములను సిద్ధం చేశారు. గత ఐదేళ్లుగా పంట వేయకుండా ఉన్న భూమిని మట్టి పనుల పేరుతో, మెట్ట దుక్కు పేరుతో అటవీశాఖ అధికారులను మభ్యపెట్టి చెరువుల అక్రమ తవ్వకాలకు తెరలేపారు.

నిడమర్రు జూన్ 22 : సుమారు 450 ఎకరాలు చెరువు తవ్వకం కోసం మెట్ట దుక్కు పేరుతో ఏక గట్టు వేయడం కోసం పాత పొలం గట్లు తీసివేసి ఏకచెరువుకు అనుకూలంగా తయారుచేశారు. అటవీ శాఖ అధికారులు వ్యవసాయం కోసం ఇలా చేయరు కదా అని ఎవరైనా ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా తిరిగి తమపై వారు జులుం ప్రదర్శిస్తున్నారని, కిరాయి మనుషులను అడ్డంపెట్టుకొని దౌర్జన్యంగా పనులు కానిచ్చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పుడు



కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వ పెద్దలతోనూ, స్థానిక ప్రజాప్రతినిధులతో తమ పని కానిచ్చేయడానికి అప్పుడే లాబీయింగ్‌లు మొదలుపెట్టే ప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వ పెద్దలు కొల్లేరు మాఫియాకు సహకరిస్తారా.. లేదా కొల్లేరు పరిరక్షిస్తారా.. అని స్థానికులు ఎదురు చూస్తున్నారు.

చెరువులపై మాఫియా డేగ కన్ను

నిడమర్రు మండలం పెదనిండ్రకొలను పెద్దింట్లమ్మ గుడి నుంచి ఐదు కిలోమీటర్ల లోపలకు గల కొల్లేరు కాంటూరు పొలాల్లో సుమారు 450 ఎకరాలు చెరువుల తవ్వకానికి రంగం సిద్ధం చేస్తున్నారు. క్రొవ్విడి ఉప్పరగూడెం శివారులోని కాంటూరు భూముల్లోను చెరువుల తవ్వకాలకు రంగం సిద్ధమవుతున్నట్టు సమాచారం. వర్షాకాలానికి ముందే ఏదో ఒకరోజు ఒక్కసారిగా 400 పైచిలుకు ట్రాక్టర్లతో ఈ పని పూర్తి చేయడానికి తగిన ఏర్పాట్లలో మాఫియా నిమగ్నమైనట్టు సమాచారం. క్రొవ్విడిలో సుమారు 1000 ఎకరాల్లో ఈ చెరువుల తవ్వకాలను రంగం సిద్ధమైనట్టు తెలుస్తోంది.

చిన్న, సన్న కారు రైతులు సాగు చేసుకునే వ్యవసాయ భూములపై పెద్దల డేగ కన్ను పడింది. రైతులకు చెరువు లీజుల ఆశ జూపి తమ అక్రమ సంపాదనకు మార్గం సుగమం చేసుకుంటున్నారు. స్థానికంగా గల గత అధికార పార్టీ నాయకులు దీనికి బాధ్యత తీసుకుని రైతులను ఒప్పించినట్టు సమాచారం. మొత్తం వ్యవహారమంతా గ్రామంలోని వైసీపీ నాయకుల కనుసన్నల్లో జరుగుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. కొంతమంది రైతులు ధైర్యం చేసి తామే సొంతంగా తవ్వుకుంటామని చెబితే అదెలా కుదురుతుందని బెదిరిస్తున్నారు. తమను కాదని నువ్వు చెరువు ఎలా తవ్వగలవో చూద్దామంటూ హెచ్చరిస్తున్నారు.

అటవీ అధికారుల చర్యలేవి ?

కొల్లేరు కాంటూరు భూములపై కన్నేసిన మాఫియా మార్చిలో చెరువుల తవ్వకాలను చేపట్టారు. కొందరు రైతులతో ఒప్పందం చేసుకుని మార్చి 27న నిడమర్రు కొల్లేరు ఆయకట్టు పరిధిలో సుమారు వందకు పైగా ట్రాక్టర్లను ఎక్కువ కిరాయికి మాట్లాడుకుని మెట్టదుక్కు ముసుగులో వందెకరాల చుట్టూ మూడు అడుగుల మేర మట్టిని పోగు చేసి గట్లు వేయడం ప్రారంభించారు. ఈ విషయం తెలిసి జిల్లా అటవీ శాఖ అధికారులు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పనుల నిలుపుదలకు ప్రయత్నించగా రైతులు టెంట్ వేసి తమ భూముల్లో పనులు చేసుకుంటుంటే మీరెందుకు ఆపుతారంటూ అడ్డం తిరిగారు. చివరకు అక్కడ వ్యవసాయం మాత్రమే చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా చెరువులు తవ్వితే చర్యలు తీసుకుంటామంటూ భూయజమానులైన రైతులకు, ట్రాక్టర్ల యజమానులకు జిల్లా అటవీ శాఖాధికారిణి హిమశైలజ నోటీసులు జారీచేశారు. అప్పటి వరకు వేసిన పెద్ద గట్లు తొలగించాలని ఆదేశించారు. ఇది జరిగి 90 రోజుల గడవక ముందే కొందరు మళ్లీ రైతులను అడ్డం పెట్టుకుని చెరువుల తవ్వకాలకు ప్రయత్నిస్తున్నారు.

ఇదీ రైతుల మొర

కొల్లేరు కాంటూరు భూముల విషయంలో చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. తాతల కాలం నాటి నుంచి వారసత్వంగా పొందిన పొలాలు ప్రస్తుతం సాగుకు అనుకూలంగా లేవు. దీనికి ప్రధాన కారణం కొల్లేరు కాంటూరు భూముల్లో 3 కాంటూరు లోపల గల నడి కొల్లేరులో గల వ్యవసాయ భూములను ఆక్రమించి మాఫియా కొన్నేళ్లుగా చెరువుల సాగు చేస్తోంది. గతంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన లవ్ అగర్వాల్ ప్రత్యేకంగా కొల్లేరు ఆపరేషన్ నిర్వహించి బాంబులతో ఆక్రమంగా తవ్విన చెరువుల గట్లు పేల్చివేశారు. ఆయన ఉన్నంత కాలం సైలెంట్‌గా ఉన్న మాఫియా ఆయన బదిలీ అయిన వెంటనే మళ్లీ మిషన్లతో గట్లు వేసి దర్జాగా సాగుచేస్తున్నారు. దీనికి అప్పట్లో కొంతమంది ప్రజాప్రతినిధుల ఆశీస్సులు ఉన్నట్టు ఆరోపణలున్నాయి.

కొల్లేరు మూడో కాంటూరు లోపల గల మురుగుబోదెలు, దారులు ఆక్రమించి ఒక్కొక్కటి 100 నుంచి 150 ఎకరాలు చెరువులను తవ్వకం చేశారు. ఈ విధంగా మురుగు బోదెలు, దారులు మిగతా 8వ పేజీలో..

వాన.. ఉక్కపోత



భీమవరం టౌన్, జూన్ 22: రుతు పవనాల ప్రభావంతో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు జిల్లాలో భారీ వర్షం కురిసింది. తొమ్మిది గంటల తర్వాత వర్షం ఆగిపోయి, ఉక్కపోత మొదలవడంతో జనం తీవ్ర ఇబ్బంది లు పడ్డారు. వర్షం కారణంగా రెక్కల పురుగులు పెద్ద సంఖ్య లో ఇళ్లల్లోకి చొరబడడంతో అవస్థలకు గురయ్యారు. మండలాల వారీగా వర్షపాతం వివరాలు.. పెనుమంట్రలో 8.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, పెనుగొండ 4, ఆచంట 3.6, పోడూరు 7.4, మొగల్తూరు 2.6, నరసాపురం 5, పాలకొల్లు 16.4, యలమంచిలి 10, గణపవరం 10.2, ఆకివీడు 14, ఉండి 18.2, పాలకోడేరు 17.2, వీరవాసరం 3.2, భీమవరం 4.2, కాళ్ళ 11.2, పెంటపాడు 35, తణుకు 8, అత్తిలి 6.4, ఇరగవరం 3.2 మి.మీగా నమోదైంది.

అతిసార, డెంగీలపై అప్రమత్తంగా ఉండాలి

భీమవరం టౌన్, జూన్ 22 : అతిసారం, డెంగీ వంటి సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు అధికారులు పూర్తి సన్నద్ధతతో పనిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి గూగుల్ మీట్ ద్వారా ఆర్‌డబ్ల్యూఎస్, ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమీక్షించారు. 'ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయించాలి. తాగునీటి శాంపిల్స్ ల్యాబ్‌ల్లో టెస్టింగ్ జరుగుతుందో లేదో పర్యవేక్షించాలి. ట్యాబ్లెట్స్‌తో ట్యాంక్‌లు శుభ్రం చేయించేందుకు ఎంపీడీవోలు నిధులు అందజేయాలి. మొగల్తూరు ప్రాంతంలో శివారు ప్రాంతాల ప్రజలు సాగు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలి' అని కలెక్టర్ ఆదేశించారు. వచ్చే నెల ఒకటి నుంచి ఆగస్టు 31 వరకు డయేరియా నియంత్రణపై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి బి.వి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపులో

చేతివాటం

- కొల్లేటికోట పెద్దింటమ్మ ఆలయంలో రూ.50 వేలు కొట్టేసిన ఉద్యోగి.. విధుల నుంచి తొలగింపు
- పూర్తి స్థాయి విచారణకు కొల్లేటి వాసుల డిమాండ్

కైకలూరు, జూన్ 22 : హుండీ లెక్కింపులో ఓ ఉద్యోగి చేతి వాటం ప్రదర్శించాడు. కొల్లేటికోట పెద్దింటమ్మ ఆలయంలో వెలుగుచూసిన ఈ ఘటన వివరాలివి.. మూడేళ్ల క్రితం శృంగవరప్పాడు శివారు గోకర్ణపురానికి చెందిన సాయిచందు అప్పటి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు సిఫారసుతో పార్ట్ టైం ఉద్యోగిగా పెద్దింటమ్మ ఆలయంలో చేరాడు. ఈ నెల 19న గుడివాడ దేవదాయ శాఖ అధికారులు, పోలీసు, రెవెన్యూ, గ్రామస్థుల సమక్షంలో హుండీ లెక్కింపు చేపట్టారు. ఆ సమయంలో సాయిచందు చేతివాటాన్ని ప్రదర్శించి, రూ.50 వేలను పక్కకు విసిరేశాడు. దీనిని గమనించిన ఓ వ్యక్తి విషయాన్ని ఆలయ అధికారి కేవీ గోపాలరావు దృష్టికి తీసుకువెళ్లాడు. దీనిని ధ్రువీకరించేందుకు ఆలయ సీసీ కెమెరాలను పరిశీలించగా నగదు విసిరేయడం నిజమేనని తేలింది. దీనిపై సాయిచందును నిలదీయగా అతను నగదు తిరిగి ఇచ్చేశాడు. హుండీ లెక్కింపులో పాల్గొన్న గ్రామ సర్పంచ్ భర్త బలే సముద్రుడు దీనిపై పోలీసు కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. అయితే ఉద్యోగిని విధుల నుంచి తొలగిస్తామని, ఈ విషయాన్ని ఇక్కడితో వదిలి పెట్టాలని ఆలయ అధికారి వారిని వేడుకున్నాడు. ఈ విషయం శనివారం కొల్లేటి గ్రామాల్లో గుప్పుమంది. దొంగ దొరికినా ఆలయ అధికారులు కప్పిపుచ్చడం వెనుక వారి హస్తం కూడా ఉందని ప్రచారం జరుగుతోంది. ఆ ఉద్యోగి గతంలోనూ ఇలాంటి తప్పిదాలు చేసి ఉంటాడనే అనుమానాలు వ్యక్తం చేస్తూ.. విచారణకు కొల్లేటి వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఆలయ ఈవో గోపాలరావును వివరణ కోరగా హుండీల లెక్కింపు సమయంలో సాయిచందు నగదు అపహరణ చేసిన విషయం వాస్తవమేనని, అతన్ని విధుల్లో నుంచి తొలగించినట్టు స్పష్టం చేశారు.



గుడిని కూల్చినా.. విగ్రహాన్ని ధ్వంసం చేసినా చర్యల్లేవ్ !

వైసీపీ నేతలకు పోలీసుల అండ : దుర్గమ్మ పీఠం నిర్వాహకుడి ఆవేదన



ద్వారకా తిరుమల పోలీస్ స్టేషన్ వద్ద పోలీసుల తీరును తప్పు బడుతున్న గుడి నిర్వాహకులు

ద్వారకా తిరుమల, జూన్ 22: 'హిందూ ఆధ్యాత్మిక కేంద్రాన్ని వాణిజ్య కేంద్రంగా మార్చలేదన్న కక్షతో వైసీపీ నేతలు కొందరు కనకదుర్గమ్మ పీఠాన్ని నేలమట్టం చేశారు. వారికి కొమ్ము కాస్తూ పోలీసులు కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారు' అని పీఠం నిర్వాహకుడు తోట గంగాధర్ భవాని ఆరోపించారు. ద్వారకా తిరుమల పోలీస్‌స్టేషన్ వద్ద శనివారం గ్రామ పెద్దలతో కలిసి మాట్లాడారు. 'తిమ్మాపురం శివారులో హిందూ దళితులు ఆరేళ్లుగా కనక దుర్గమ్మ పీఠాన్ని ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. గ్రామ వైసీపీ నాయకులు బొల్ల శ్రీను, మద్దిపాటి సత్యనారాయణ, అతని కుమారుడు పెదనాని, బన్నుతోపాటు వాసిరెడ్డి నరసింహరావు, అతని కుమారుడు సోంబాబు నన్ను, ఇతర నిర్వాహకులను పిలిచి పీఠానికి వచ్చే వారి నుంచి రూ.200 వసూలు చేసి అందులో సగం తమకివ్వాలని డిమాండ్ చేశారు. దీనికి నిరాకరించడంతో నన్ను కులం పేరుతో దూషించి, పీఠం నుంచి బయటకు గెంటేశారు. దీనిపై ఈ ఏడాది జనవరి 11న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆ రాత్రే వైసీపీ నేతలు అమ్మ వారి విగ్రహాన్ని ధ్వంసం చేసి, పీఠాన్ని కుప్పకూల్చారు. దీనిపై మేం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాం. ఈ క్రమంలో శనివారం నన్ను స్టేషన్‌కు రమ్మని ఎస్‌ఐ పిలవడంతో వెళ్లా. రికవరీ చేసిన దుర్గమ్మ విగ్రహాన్ని అప్పగించేందుకు పిలిచినట్లు తెలిపారు. గుడిని నేలమట్టం చేసిన మిషన్‌ను ఎందుకు సీజ్ చేయలేదని ప్రశ్నించాను. కూల్చివేతకు వినియోగించిన మిషన్ స్థానంలో వేరేది చూపిస్తున్నారు. పోలీసులు వైసీపీ నాయకులపై కొమ్ము కాస్తున్నారు. ఇంత వరకు సరైన విచారణ చేపట్టలేదు. గుడిని కూల్చి, విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు లేవు. కేసు పెట్టి ఐదు నెలలు గడుస్తున్నా నిందితులను అరెస్టు చేయలేదు' అని గంగాధర్ పోలీసుల తీరును తప్పుపట్టారు.

• పితాని సత్యనారాయణ అనే నేను..



ఆచంట, జూన్ 22 : ఆచంట ఎమ్మెల్యేగా పితాని సత్యనారాయణ నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం సమయాభావం వల్ల ఆయన ప్రమాణం చేయలేకపోయారు. దీంతో శనివారం స్పీకర్ ఆయనతో ఈ రోజు చేయించారు. భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించిన అధికారాన్ని దుర్వినియోగం చేయకుండా పూర్తి నిబద్ధతను పాటిస్తానని, రాజ్యాంగం పట్ల నిజమైన విధేయత చూపుతానని భారత దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడతానని ప్రమాణంలో పితాని పేర్కొన్నారు.

• అత్తిలిలో ఎక్స్‌ప్రెస్ రైలు హాల్ట్‌కు చర్యలు : వర్మ

అత్తిలి, జూన్ 22 : అత్తిలిలో ఎక్స్ ప్రెస్ రైళ్లు ఆగేలా చర్యలు తీసుకుం టానని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ హామీ ఇచ్చారు. అత్తిలిలో హనుమాన్ శక్తి జాగరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు. 'ఇక్కడకు వచ్చిన ప్రతీసారి ఈ సమస్యను నా దృష్టికి తీసుకువచ్చే వారు. ముందుగా ఒక ఎక్స్‌ప్రెస్ రైలు ఆగేలా చర్యలు తీసుకుంటా. ఆ తర్వాత మిగిలినవి పరిశీలిద్దాం' అని తెలిపారు.

• మరో రెండు మృతదేహాలు లభ్యం

పెదవేగి, జూన్ 22 : బాపట్ల జిల్లా రామాపురం బీచ్‌లో సముద్ర స్నానానికి వెళ్లి గల్లంతైన పెదవేగి మండలం దుగ్గిరాలకు చెందిన మరో ఇద్దరి మృతదేహాలు శనివారం లభ్యమయ్యాయి. శుక్రవారం విహారయాత్రకు వెళ్లిన వారిలో నలుగురు యువకులు సముద్ర స్నానం చేస్తూ గల్లంతయ్యారు. రాత్రికి రెండు మృతదేహాలు లభ్యం కాగా, మరో రెండు శనివారం ఉదయానికి దొరికాయి. సాయంత్రానికి స్వగ్రామం దుగ్గిరాల తీసుకొచ్చారు. మృతదేహాలను చూసిన బంధువులు, గ్రామస్థులు బోరున విలపించారు.

పాలకొల్లు పురపాలక సంఘం

ఆర్.ఓ.సి.నెం. 769/2015/ఇ1, ది.22.06.2024

ఇ-ప్రోక్యూర్‌మెంటు టెండరు నోటీసు

పాలకొల్లు పురపాలక సంఘము పరిధిలో నందు పురపాలక సంఘము నిధులతో 31 వార్డులో వీధిలలోని ఎల్ఈడి లైట్లు ఎలెక్ట్రికల్ మెయింటినాన్స్ కొరకు స్పేర్ పార్ట్స్ సప్లయ్ చేయుట, రిపేర్లు మరియు నిర్వహణ కొరకు అవుట్ సోర్సింగ్ (టెక్నికల్) సిబ్బంది, 20వ వార్డు నందు బస్ స్టాండ్ వద్ద మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద డ్రైను పైన యం.యస్ ఐరన్ గ్రిల్ ఏర్పాటు, ఆర్.సి.సి.కల్వర్టు, 242MLD సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ బండ్ నందు, స్త్రీ స్వశక్తి భవనము నందు ప్లంబింగ్ మరియు ఎలెక్ట్రిఫికేషన్ ఏర్పాటు చేయుట, పురపాలక సంఘ ఆఫీసు నందున్న ఇంజనీరింగ్ విభాగమును రిపేర్లు చేయు నిమిత్తం (7 పనులకు) గాను అంచనాలు విలువ సుమారు రూ.60,38,000/- లతో ఇ-ప్రోక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు కోరడమైనది. టెండరు షెడ్యూలు ఇ-ప్రోక్యూర్‌మెంటు మార్కెట్ నందు ది.24.06.2024 తేది సాయంత్రం 4.00 ని.ల నుండి లభించును.

మిగిలిన వివరములు ఇ-ప్రోక్యూర్‌మెంట్ మార్కెట్ www.tender.apeprocurement.gov.in లేదా కమీషనరు, పాలకొల్లు పురపాలక సంఘము, పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా వారిని సంప్రదించగలరు.

కమీషనరు
పాలకొల్లు పురపాలక సంఘం



మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి జస్టిస్ కృష్ణమోహన్.. పూలమొక్కను అందిస్తున్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్

చట్టాలపై మరింత విజ్ఞానం పెంచుకోవాలి

» రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ కృష్ణమోహన్

ఏలూరు కలెక్టరేట్/ఏలూరు క్రైం, జూన్ 22: చట్టాలపై న్యాయమూర్తులకు విజ్ఞానాన్ని మరింత పెంచడానికి న్యాయాధికారుల వర్క్‌షాప్‌లు ఎంతగానో దోహదపడతాయని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ వి.కృష్ణమోహన్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ అధ్యక్షతన జస్టిస్ ఏవీ శేషసాయి ఆధ్వర్యంలో జిల్లాలోని న్యాయమూర్తులకు చట్టాలకు సంబంధించిన పలు అంశాలపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయాధికారులకు ప్రామిసరీ నోటు దావాలలో అమలు, పిటిషన్‌పైన, చట్టాలపై స్థూలమైన, విధానపరమైన అవగాహన అవసరమన్నారు. ఇతర అంశాలపై న్యాయ విజ్ఞానంతో సన్నద్ధం చేయటానికి వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వర్క్‌షాపులో రిసోర్స్‌పర్సన్ రిటైర్డ్ న్యాయమూర్తి, ఏపీఏటీ మాజీ చైర్మన్ వై.వి రామకృష్ణ పాల్గొని ఎగ్జిబిషన్ ఆఫ్ డిగ్రీఫర్ ఎవిక్షన్, డెలివరీ, డిటర్మినేషన్ చట్టాలపై మారుతున్న సవరణలపైన న్యాయమూర్తులకు వివరించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలసిన జిల్లా అధికారులు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయాధికారుల వర్క్‌షాపునకు విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్, కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, అదనపు ఎస్పీ జి.స్వరూప రాణి మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందించారు. వీరితో పాటు ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావళి, ఏలూరు బార్ అధ్యక్షుడు అబ్బినేని విజయ్‌కుమార్ పలువురు పూలమొక్కలను అందించారు.

డీజీపీకి శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ



ఏలూరు క్రైం, జూన్ 22 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీగా పదవీ బాధ్యతలు చేపట్టిన సీహెచ్ ద్వారకాతిరుమలరావును ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి కలిశారు. శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఐటీఐ ప్రవేశార్థులకు సూచన

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 22 : ఏలూరులోని ప్రభుత్వ ఐటీఐలో తొలివిడత అడ్మిషన్లకు ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తుచేసుకున్న బాలబాలికల్లో అర్హతలుండీ కౌన్సిలింగ్‌కు హాజరుకాలేని వారికి ఈనెల 24న జనరల్ పూల్ అడ్మిషన్ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి.రజిత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజున ఉదయం పది గంటలకు మెరిట్ నంబరు ఒకటి నుంచి 224వరకు, మధ్యాహ్నం ఒంటి గంటకు 225నుంచి 454 వరకు అభ్యర్థులు హాజరుకావచ్చని వివరించారు.

26న ఏలూరు ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 22 : ఉపాధి, శిక్షణశాఖ ఆధ్వర్యంలో ఈనెల 26న ఏలూరు సత్రంపాడులోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రజిత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ కంపెనీలు హాజరయ్యే జాబ్‌మేళాకు ఐటీఐ ఉత్తీర్ణులై, అప్రెంటీస్ పూర్తిచేసిన అభ్యర్థులు, ఐటీఐ చివరి ఏడాది చదువుతున్న ట్రైనీలు హాజరుకావచ్చన్నారు. అభ్యరుథులు తమ విద్యార్హతల ధ్రువీకరణపత్రాలు, ఐడీ ప్రూఫ్‌లు, పాస్ ఫొటోలతో హాజరుకావాలన్నారు. వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయం 08812-230269 నంబరులో సంప్రదించాలని కోరారు.

24న గురుకుల ప్రవేశానికి రాత పరీక్ష

పెనుగొండ, జూన్ 22 :పెనుగొండ సాంఘిక సంక్షేమ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మిగులు సీట్లు భర్తీ చేసేందుకు ఈనెల 24న ఉదయం 11 గంటలకు రాత పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.ఎస్తేర్‌క్వీన్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి 6,7,8,9వ తరగతులకు మిగులు సీట్లు భర్తీ చేసేందుకు రాత పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆరో తరగతి 41 సీట్లు, ఏడో తరగతికి మూడు సీట్లు, ఎనిమిదో తరగతికి మూడు సీట్లు, తొమ్మిదో తరగతికి ఐదు సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు.

శ్రీవారి క్షేత్రానికి టీడీపీ నేతల పాదయాత్ర



దొరాజీకి స్వాగతం పలుకుతున్న మండల నేతలు

ద్వారకాతిరుమల, జూన్ 22: చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పాటుబడుతుందని టీడీపీ నేత ముళ్లపూడి దొరాజీ చౌదరి అన్నారు. చంద్రబాబు సీఎం కావాలని, గోపాలపురం ఎమ్మెల్యేగా మద్దిపాటి వెంకట్రాజు గెలవాలని చినవెంకన్నకు మొక్కుకున్న తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం దుద్దుకూరుకు చెందిన నేత ముళ్లపూడి దొరాజీ చౌదరి తలపెట్టిన భారీపాదయాత్ర శనివారం సాయంత్రం ద్వారకాతిరుమల మండలానికి చేరుకుంది. రాళ్లకుంట వద్దకు టీడీపీ నేతలు, తెలుగుమహిళలతో చేరుకున్న పాదయాత్రకు పార్టీ మండల అధ్యక్షుడు లంకా సత్యనారాయణ, మొగతడకల శ్రీనివాసరావు తదితరులు ఘనస్వాగతం పలికారు. అనంతరం శ్రీవారి క్షేత్రానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించి పూజలు జరుపుకు న్నారు. నేతలు ఘంటా శ్రీనివాసరావు, మటపర్తి బద్రి, ఏపూరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి, సమైక్యతా భావం ఉండాలి

» కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

భీమవరం టౌన్/అత్తిలి, జూన్ 22 : విద్యార్థి దశ నుంచే దేశభక్తి,సమైక్యతా భావం ఉండాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ అన్నారు. శనివారం భీమవరంలోని ఏఆర్‌కేఆర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులతో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో జాతీయ సమైక్యత ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బండా వీర్రాజు ప్రాథమిక పాఠశాల, ఏఆర్ కేఆర్ మున్సిపల్ హైస్కూల్, కేజీ ఆర్ఎల్‌లో ఇంటర్, డీఎన్నార్ లా చదివానని, స్కూల్లో ఎస్పీఎల్‌గా ఉన్నానని, జాతీయ సమైక్యత కార్యక్రమాలను నిర్వహించడం గొప్పవిశేషమని అన్నారు. మన భారతదేశం జాతీయ సమైక్యతతోనే నడుస్తుందని, దేశ ప్రధాని మోదీ స్ఫూర్తితో దేశాభివృద్ధికి సహకరించాలన్నారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ చిన్నప్పటి నుంచి విద్యార్థి సంఘ నాయకునిగా విద్యార్థుల సమస్యలు తీర్చారన్నారు. ఇటువంటి జాతీయ సమైక్యత స్ఫూర్తితో విద్యార్థుల్లో చైతన్యం కలుగుతుందన్నారు. అనంతరం 400 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ పట్టణంలోని పలు వీధుల మీదుగా సాగింది. హైస్కూల్ హెచ్ఎం ఏవీ సత్యనారాయణ, నరహరిశెట్టి కృష్ణ, కొండ్రు శ్రీనివాస్, కాగిత సురేంద్ర, అరసవల్లి సుబ్రహ్మణ్యం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా శ్రీనివాసవర్మ చేతుల మీదుగా విద్యార్థులకు బ్యాగ్‌లను అందజేశారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర..

అత్తిలిలో హనుమాన్ శక్తి జాగరణ సమితి వారిచే శోభాయాత్ర శనివారం వైభవంగా నిర్వహించారు. తొలుత కోలాట భజనలు, తీన్‌మార్ డప్పులు, హనుమాన్ వేషధారణలు, చివరిగా బైక్ ర్యాలీని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, స్వామీజీలు శ్రీనివాసనంద సరస్వతి స్వామీజీ, శ్రీధర్ స్వామీజీలు, స్వరూపానంద స్వామీజీ ప్రారంభించారు. శోభాయాత్ర అత్తిలి డిగ్రీ కళాశాల నుంచి కాల్వగట్టు, గోపాలస్వామి గుడి వీధి, శివాలయం, తణుకు రోడ్డు మీదుగా వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు వైభవంగా నిర్వహించారు. హిందుత్వ విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని శ్రీనివాసనంద సరస్వతి స్వామీజీ అన్నారు. అనంతరం ముక్కామల పీఠం స్వామీజీ, శ్రీధర్ స్వామీజీ మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ నాయకులు ఓలేటి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ పాశ్చాత్య సంస్కృతికి లొంగక భారతీయ సంప్రదాయాలను గౌరవించాల న్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ బాల నృత్య కళాకారిణి తణుకుకు చెందిన హర్షిత నాగశ్రీ ప్రదర్శించిన నాట్య ప్రదర్శన ఆహూతులను అలరించింది.





భీమవరంలో జాతీయ సమైక్యత ర్యాలీని ప్రారంభిస్తున్న శ్రీనివాసవర్మ అత్తిలి హనుమాన్ శోభాయాత్రలో..

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

» వైద్యసిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

» పశ్చిమ గోదావరి జిల్లా డీఎంహెచ్‌వో మహేశ్వరరావు



పోడూరు పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో

పోడూరు, జూన్ 22 : ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు ఆదేశించారు. శనివారం పోడూరు పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతున్నాయన్నారు. గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకం కలిగేలా అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. ప్రతీ నెలా కనీసం పది ప్రసవాలు జరిగేలా చూడాలని వైద్యసిబ్బందికి సూచించారు. వైద్య సిబ్బంది రోగుల పట్ల బాధ్యతగా ఉండాలని, ఫిర్యాదులు వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు, డయేరియా వంటివాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పీహెచ్‌సీలో రోజువారీ నిర్వహణ రికార్డులను పరిశీలించి, నిర్మాణంలో వున్న లేబొరేటరీ భవనాన్ని పరిశీలించారు. పీహెచ్‌సీలో మూడు ఎంఎల్‌హెచ్‌సీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వీటిని భర్తీ చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రీవాసవి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీవాసవి, ఏఎస్‌వో సత్యనారాయణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



నన్నయ ఆచార్యులకు రూస ప్రాజెక్టు పత్రాలను అందజేసిన వీసీ

8 మంది 'నన్నయ' ఆచార్యులకు రూస ప్రాజెక్టులు

రాజమహేంద్రవరం, జూన్ 22: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఎనిమిది మంది ఆచార్యులకు రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షాఅభియాన్ (రూస) ద్వారా ప్రాజెక్టులు మంజూరయ్యాయని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. విశ్వవిద్యాలయంలో సంబంధితులకు ప్రాజెక్టు పత్రాలను శనివారం వీసీ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనివర్శిటీ ఆర్ట్స్, కామర్స్ కళాశాలలోని ఆంగ్ల విభాగానికి చెందిన ఆచార్య కె.శ్రీరమేష్, ఎన్.సజన్‌రాజ్‌లకు, సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలోని ఆచార్య వై.శ్రీనివాసరావు, ఆచార్య కేవీ స్వామి, ఆచార్య డి.కళ్యాణి, కె.నూకరత్నం, ఎ.మట్టారెడ్డి, పి.విజయనిర్మలకు ప్రాజెక్టులు మంజూరయ్యాయన్నారు. రూస నిధులతో నిర్వహించే ఈ ప్రాజెక్టులను సమర్థవంతంగా పూర్తి చేసి కొత్తవిషయాలను సమాజానికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

యోగా కాన్షియస్ ట్రస్ట్‌తో 'నన్నయ' ఎంవోయూ

రాజమహేంద్రవరం, జూన్ 22: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, సెంటర్స్ ఆఫ్ యోగా కాన్షియస్ ట్రస్ట్(వైసీటీ) గోదావరి శాఖ కానవరంలోని శ్రీరాపర్తి రామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా మధ్య అవగాహన ఒప్పందాన్ని తిరిగి ప్రారంభించామని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. విశ్వవిద్యాలయంలో శనివారం ఎంఓయూ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ సుధాకర్, శ్రీరాపర్తిరామ యోగా సంస్థ కార్యదర్శి ఎంవీజీఎస్ శర్మ ఎంవోయూలపై సంతకాలు చేసి పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వైసీటీ, నన్నయ వర్శిటీ మధ్య ఎంవోయూ తిరిగి ప్రారంభించామని, విద్య పరిశోధనలను ప్రోత్సహించడానికి సంయుక్తంగా పనిచేస్తామన్నారు. సంస్థ సహకారంతో పీజీ డిప్లమో ఇన్ యోగా కోర్సును అందిస్తున్నామని, అందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, డీన్ ఆచార్య పి.సురేష్‌వర్మ పాల్గొన్నారు.

'కాపులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలి'

పాలకొల్లు టౌన్, జూన్ 22: గత ప్రభుత్వ కాలంలో జరిగిన ఉద్యోగ, ఉపాధి నియామకాల్లో ఐదు శాతం రిజర్వేషన్ కాపులకు ఇవ్వకపోవడంతో ఎంతో నష్టపోయామని మాజీ ఎంపీ, కాపుబలిజ సంక్షేమ సేన ఫౌండర్ ప్రెసిడెంట్ చేగొండి హరిరామ జోగయ్య శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ నియామకాల్లో కాపులకు రిజరేషన్ సౌకర్యం అమలు జరపకపోతే మరింత నష్టపోతారన్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాపులకు అగ్రవర్ణాల పది శాతం ఈడబ్ల్యూఎస్ కోటాలో ఐదు శాతం రిజర్వేషన్లు కలుగజేస్తూ ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలులోకి తీసుకునిరాలేదన్నారు. దీన్ని కాపులపై జగన్ కక్షసాధింపు చర్యగా భావిస్తున్నామన్నారు.



శ్రీవారి దర్శనానికి క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉన్న యాత్రికులు

శ్రీవారి క్షేత్రంలో భక్తులు కళకళ

ద్వారకాతిరుమల, జూన్ 22: భక్తుల గోవింద నామాలతో చిన్న తిరుమలేశుని క్షేత్రం మార్మోగింది. స్వామికి ఇష్టమైన రోజు కావడంతో శనివారం ఆలయానికి వచ్చిన యాత్రికులతో పరిసరాలు కళకళలాడాయి. ఆలయానికి దాదాపు 20 వేల మంది పైబడి భక్తులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. ఆలయానికి వచ్చిన పలువురు యాత్రికులు ముందుగా కేశఖండనశాలలో మొక్కుబడులు తీర్చుకున్నారు. శ్రీవారి దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లపై వేధింపులు ఆపాలి



ద్వామా పీడీకి వినతిపత్రం సమర్పిస్తున్న సంతోష్ కుమార్

ఏలూరుటూటౌన్, జూన్ 22 : మహాత్మాగాంధీ ఉపాధి పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లపై వేధింపులు ఆపాలని ఏపీ ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం ఏలూరులో డ్వామా పీడీ పి.రాముకి వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో కొంతమంది రాజకీయ నాయకుల అనుచరులు ఫీల్డ్ అసిస్టెంట్లను ఇబ్బంది పెడుతున్నారన్నారు. తగు విచారణ జరిపి ఫీల్డ్ అసిస్టెంట్లకు రక్షణ కల్పించాలని కోరారు.

పాఠశాల విద్యాసామగ్రి గది సీజ్



గదిని సీజ్ చేసిన ఎంఈవో జ్యోతి

ఉండి, జూన్ 22: ఉండి గీతాంజలి ప్రైవేటు స్కూల్‌లో విద్యాసామగ్రి విక్రయాలకు సంబంధించి అధికంగా నగదు వసూలు చేస్తున్నారనే విషయం తనదృష్టికి రావడంతో పాఠశాలకు వెళ్లి విద్యాసామగ్రి గదిని సీజ్ చేశామని ఎంఈవో జ్యోతి శనివారం తెలిపారు. విద్యాసామగ్రికి అధికంగా నగదు వసూలు చేయడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి శ్రీనివాస్ ఆరోపించారు. ఈ విషయమై విద్యాశాఖ దృష్టికి తీసుకుని వెళ్లినా పట్టించుకోకపోవడంతో ఎంఈవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. స్పందించిన ఎంఈవో పాఠశాలకు వెళ్లి తనిఖీలు చేసి గదిని సీజ్ చేశారు. యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చందు, గోవిందు, సాయి, వెంకట్, గణేష్, సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది అడుగుల నల్లతాచు హల్‌చల్



జంగారెడ్డిగూడెం, జూన్ 22 : జంగారెడ్డిగూడెం పట్టణ శివారు బైపాస్ రోడ్‌లోని ప్రకృతి నర్సరీ ఎదురుగా ఉన్న సీట్ కవర్ల షాపులోకి ఎనిమిది అడుగుల నల్లతాచు శనివారం హల్‌చల్ చేసింది. పాము రాకను గమనించిన షాపు యజమాని స్నేక్ సేవియర్ సొసైటీ సంస్థ నిర్వాహకుడు చదలవాడ క్రాంతికి సమాచారం అందించగా అక్కడకు చేరుకుని సురక్షితంగా పట్టుకున్నారు. ఆ పామును అడవిలో వదిలిపెడతామని ఆయన తెలిపారు.

టీటీడీకి కూరగాయల వితరణ

నూజివీడు టౌన్, జూన్ 22: టీటీడీలోని నిత్యాన్నదాన సత్రానికి నూజివీడుకు చెందిన పలువురు దాతలు కూరగాయలను అందించారు. నూజివీడు నుంచి ప్రతినెలా అన్నదాన సత్రానికి కూరగాయలు తరలిస్తుం డగా, శనివారం సుమారు 14 టన్నుల కూరగాయలను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేక వాహనంలో తిరుమలకు పంపినట్టు దాత నక్కా సత్యనారాయణ తెలిపారు. దొండ, బెండ, సొర తదితర కూరగాయలను వెంగమాంబ అన్నదాన సత్రానికి తరలించినట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

విచారణ చేస్తారా..?

» న్యాయం జరగలేదు.. పరిహారం ఇవ్వలేదు

» ప్రైవేట్ లైన్‌మన్ మృతి చెంది ఏడు నెలలు

» బాధ్యుల్ని కాపాడుతున్న అధికారులు

» కేసులో అనుమానాలు అనేకం



షణ్ముకం (ఫైల్)

నరసాపురం, జూన్ 22: ప్రైవేట్ లైన్‌మన్ షణ్ముకం మృతి చెంది ఏడు నెలలు గడుస్తున్నా.. ఇంతవరకు ఎవరిపై చర్యలు తీసుకోలేదు, విచారణే ముందుకు సాగడం లేదు. బాధ్యుల్ని ఈపీడీసీఎల్‌కు చెందిన ఇద్దరు కీలక అధికారులు కాపాడుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే ఈ కేసులో ఇంతవరకు ఎవరిపై సస్పెండ్ వేటు పడలేదు, మృతుడి కుటుంబానికి ఇంతవరకు న్యాయం జరగలేదు, పరిహారం ఇవ్వలేదు. ఈ సంఘటన తరువాత జరిగిన కె.బేతపూడి, కొవ్వూరు ఘటనలో మృతి చెందిన ప్రైవేట్ లైన్‌మన్‌కు పరిహారం అందింది. బాధ్యులైన లైన్‌మన్‌ను సస్పెండ్ చేశారు. షణ్ముకం సంఘటన జరిగి నెలలు కావొస్తున్నా.. ఇంతవరకు బాధ్యులెవరనేది తేలలేదు.

చెన్నై నుంచి బతుకుతెరువు కోసం దాదాపు 30 ఏళ్ల క్రితం వచ్చిన షణ్ముకం అంటే నరసాపురం పట్టణంలో తెలియని వారు ఉండరు. అర్ధరాత్రిలో కరెంట్ పోయిందని ఫోన్ చేస్తే చాలు సత్వరమే వాలిపోయేవాడు. అతడి సేవల్ని ఈపీడీసీఎల్‌లో చాలామంది లైన్‌మన్‌లు వినియోగించుకోవడం పరిపాటిగా మారింది. ముఖ్యంగా స్తంభాలెక్కని లైన్‌మన్‌లు షణ్ముకాన్ని పెట్టుకుని ఉద్యోగులుగా చలామణి అవుతున్నారు. ఇందుకు గాను అతడికి నెలకు కొంత మొత్తాన్ని చెల్లిస్తూ ఉంటారు. ఈ క్రమంలోనే గత ఏడాది డిసెంబరులో పట్టణంలో పోల్‌పై పని చేస్తుండగా విద్యుత్ షాక్ గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ముందుగా పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో ఏలూరు తరలించారు. అక్కడ వారం రోజులు చికిత్స పొంది మృతి చెందాడు. ప్రమాద విషయాన్ని ఈపీడీసీఎల్ అధికారులు బయటకు పొక్కనివ్వలేదు. అతడు మృతి చెందడంతో పోలీసులు కేసు కట్టారు. అప్పుడు విశాఖలోని ఈపీడీసీఎల్‌లోని అధికారులకు ఈ విషయాన్ని చేరవేశారే గాని, బాధ్యులెవ్వరనేది చెప్పలేదు, అప్పటి నుంచి డిపార్టుమెంటల్ విచారణ ముందుకు సాగడం లేదు. దీనికి కారణం ఈపీడీసీఎల్‌కు చెందిన ఇద్దరు ఉన్నధికారులే అనే వాదనలు ఆ శాఖ ఉద్యోగులే చెప్పుకోవడం గమనార్హం. మరోవైపు షణ్ముకం మృతిలో పోస్టుమార్టం, పోలీస్ రిపోర్టులు కీలకంగా మారాయి. కనీసం కొత్త ప్రభుత్వంలోనైనా బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుందో లేదో చూడాలి.

క్రైం సమాచారం

వేర్వేరుచోట్ల నలుగురి మృతి

ఏలూరు జిల్లాలో శనివారం వేర్వేరు చోట్ల నలుగురు మృతి చెందారు. జంగారెడ్డిగూడెం మండలం జల్లేరు పెట్రోల్ బంక్ వద్ద లారీ ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఆగిరిపల్లి మండలం ఈదులగూడెం గ్రామానికి చెందిన రైతు కూలీ విద్యుత్ షాక్‌తో మృత్యువాత పడ్డాడు. ఏలూరు సమీపంలో రైలు నుంచి జారిపడి ఒకరు.. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి గోదావరిలో స్నానానికి దిగి మృత్యువాత పడ్డాడు.

పొగాకు పనికి వెళ్తూ లారీ ఢీకొని యువకుడి మృతి

» మరొకరికి తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు



జంగారెడ్డిగూడెం, జూన్ 22 : ట్రాలీ లారీ ఢీకొని ఓ యువకుడు మృతి చెందగా.. మరో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన జంగారెడ్డిగూడెం మండలం జల్లేరు పెట్రోల్ బంకు వద్ద జరిగింది. జంగారెడ్డిగూడెం ఎస్ఐ జ్యోతిబస్ తెలిపిన వివరాలివి.. లక్కవరం గ్రామానికి చెందిన 16 మంది కూలీలు పొగాకు పని నిమిత్తం తాడువాయి చల్లావారిగూడెం గ్రామాలకు ప్రతీరోజు వెళ్తారు. శనివారం కూడా పని నిమిత్తం 14 మంది ఆటో ఎక్కగా ప్రమాదం బారిన పడిన ఇద్దరూ ఆటోలో ఖాళీ లేక ద్విచక్ర వాహనంపై బయలు దేరగా మార్గమధ్యలో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో చంద్రు దేవరాజు (18) యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో వ్యక్తి బంటుమిల్లి నాగరాజు కాలు నుజ్జునుజ్జయింది. స్థానికులు గాయాలైన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. మృతుడు దేవరాజుకు తండ్రి వెంకన్న,తల్లి మేరీ, అన్న జాన్‌రాజు ఉన్నారు. సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఫెన్సింగ్‌లో విద్యుత్ ప్రవహిస్తోందని తెలియక..

» విద్యుదాఘాతంతో రైతు కూలీ మృతి

ఆగిరిపల్లి, జూన్ 22: వరి చేనుకు వేసిన ఫెన్సింగ్‌లో విద్యుత్ ప్రవహిస్తోందని తెలియక ఆ ఫెన్సింగ్ దాటబోయిన రైతు కూలీ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈదులగూడెం గ్రామానికి చెందిన పండిపోయిన నాగేశ్వరరావు (45) ఉదయం పొలం పనికి వెళ్లి మధ్యాహ్నం 12 గంటలకు కూడా భోజనానికి రాకపోవడంతో కుటుంబీకులు పొలానికి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఫెన్సింగ్ దాటుతుండగా విద్యుదాఘాతానికి గురైనట్టు తెలిసింది. అతడితో పాటు సమీపాన మరో 12 కోతులు అదే ఫెన్సింగ్ తీగను పట్టుకుని విద్యుదాఘాతానికి గురై మరణించినట్లు కనిపించాయి.

రైలు నుంచి జారిపడి బెంగాల్ వాసి మృతి

ఏలూరు క్రైం, జూన్ 22 :వేగంగా వెళ్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు పశ్చిమ బెంగాల్ వాసి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏలూరు సమీపంలోని వట్లూరు నెహ్రూ కాలనీ దగ్గరలో రైలు పట్టాలపై ఒక వ్యక్తి మృతదేహం ఉన్నట్లు శనివారం ఉదయం ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. రైల్వే ఎస్ఐ నరసింహారావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలను బట్టి పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర్ దినైపూర్‌కు చెందిన మంగల్‌ముర్ము(47) రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు బోగీ నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం కుటుంబ సభ్యులకు అందించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

గోదావరిలో స్నానానికి దిగి బాలుడి మృత్యువాత



కార్తీక్ (ఫైల్)

ఏలూరు క్రైం, జూన్ 22 : చిన్నప్పుడే అమ్మానాన్నలను కోల్పోయిన ఆ బాలుడిని పెద్దమ్మ ఆశ్రయం కల్పించి కన్నతల్లిలా పెంచిపోషిస్తూ చదివిస్తుంది. బంధువుల ఇంటి పెళ్లికి మేనమామతో పాటు భద్రాచలం వెళ్లి సమీపంలో గోదావరి నది ఉండడంతో అందరితో పాటు ఆ బాలుడు స్నానానికి దిగి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటనతో ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో విషాదం నెలకొంది. అంగులూరి కార్తీక్ (11) 8వ తరగతి చదువుతున్నాడు. తన మేనమామతో భద్రాచలంలోని బంధువుల ఇంట్లో జరిగిన వివాహానికి శనివారం వెళ్లాడు. అక్కడ అందరితోపాటు గోదావరిలో స్నానం చేయడానికి దిగాడు. ప్రమాదవశాత్తు నీట మునిగి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటనతో బంధువులు తల్లడిల్లిపోయారు. మృతదేహం శనివారం రాత్రి ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి ఇందిరా కాలనీకి తీసుకురానున్నారు.

కుక్కునూరు పీహెచ్‌సీపై పిడుగుపాటు

» త్రుటిలో తప్పిన ప్రమాదం

కుక్కునూరు, జూన్ 22: కుక్కునూరు గ్రామంలోని పీహెచ్‌సీపై శుక్రవారం రాత్రి పిడుగుపడింది. ఉరుములు మెరుపులతో కూడిన భారీగా వర్షం పడుతున్న సమయంలో పిడుగు పడింది. ఈ క్రమంలో స్లాబు కింద నుంచి పెచ్చూడి కిందపడింది. ఆ సమయంలో అక్కడ ఆయా, ఏఎన్ఎం విధులు నిర్వహిస్తున్నారు. పెచ్చు కిందరాలిపడిన సమయంలో ఆయా భుజానికి స్వల్పగాయమైంది. ఈ ఆసుపత్రి ముందు జెండా ఎగురవేయడానికి ఇనుప రాడ్లతో కూడిన నిర్మాణం ఏర్పాటు చేశారు. దీని వల్లే పిడుగుపాటు జరిగి ఉండవచ్చని పలువురు చెబుతున్నారు.

పంట బోదెలోకి కారు బోల్తా



తాడేపల్లిగూడెం రూరల్, 22: తాడేపల్లిగూడెం మండలం పడాల అయ్యప్ప ఆలయం సమీపంలో పంట బోదెలో కారు పల్టీకొట్టిన ఘటన శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. నిడదవోలు నుంచి నలుగురు మైనర్ యువకులు ఏలూరు వైపు కారులో బయల్దేరగా అయ్యప్ప ఆలయం వద్దకు వచ్చే సరికి కారు అదుపుతప్పి పంట బోదెలోకి బోల్తా కొట్టింది. ఆ కారులో ఉన్న వారికి స్వల్పగాయాలతో బయట పడ్డారు. వారి వివరాలు తెలియాల్సి ఉంది.

పది మంది జూదరుల అరెస్ట్

జీలుగుమిల్లి/ముసునూరు, జూన్ 22: వేర్వేరు చోట్ల పేకాటాడుతున్న పది మంది జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. జీలుగుమిల్లి మండలం ములగలంపల్లి గ్రామ శివారులో పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేశామని ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. శనివారం గ్రామ శివారులో పేకాటాడుతున్నట్టు సమాచారంతో సిబ్బందితో కలసి దాడి చేశామన్నారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.50,050 నగదు, ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ముసు టనూరు మండలంలోని చింతలవల్లిలో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. చింతలవల్లికి చెందిన కలపాల థామస్, సొంగా సురేష్, పులిపాక కుమార్, పల్లిపాము ఆంజనేయులు, ముసునూరుకు చెందిన కాట్రు నాగేశ్వరరావులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 3,800 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ పి.వాసు తెలిపారు.

సొమ్ము కట్టలేదని బెల్టుతో కొట్టిన వడ్డీ వ్యాపారి

ఏలూరు క్రైం, జూన్ 22 : వడ్డీ సొమ్ము కట్టడంలేదని ఇంటికి పిలిపించి బెల్టుతో ఒక వడ్డీ వ్యాపారి చితకబాదాడు. గాయాలతో ఉన్న బాధితుడు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి రాగా ఎమ్మెల్సీగా నమోదు చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుడు ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు ఇచ్చిన వాగ్మూలం ప్రకారం ఏలూరు ఆర్ఆర్‌పేటకు చెందిన కనకం వీరభద్రరావు ఫ్లెక్సీ షాపులో పనిచేస్తున్నాడు. 2020లో తన కుటుంబ అవసరాలు నిమిత్తం ఏలూరు చొదిమెళ్ళ ఆర్టీవో ఆఫీస్ సమీపంలో నివాసం ఉంటున్న పెద్దిరెడ్డి ప్రదీప్ వద్ద లక్ష రూపాయలు అప్పు తీసుకుని ప్రతి నెలా ఆరు వేల రూపాయలు వడ్డీ కడుతున్నాడు. మూడు నెలల నుంచి వడ్డీ కట్టకపోవడంతో.. వడ్డీతోపాటు అసలు తీసుకుని ఇంటికి రావాలని సదరు వ్యాపారి కబురు పెట్టాడు. లేదంటే తనకు ఇచ్చిన ఖాళీ చెక్కులపై ఎక్కువ సొమ్ములు వేసి కేసులు వేస్తానని బెదిరించాడు. భయంతో శనివారం ఉదయం పెద్దిరెడ్డి ప్రదీప్ ఇంటికి వెళ్ళిన వీరభద్రరావును తోలు బెల్టుతో చావబాదాడు. ప్రదీప్ భార్య అడ్డుపడి ఆపడంతో అక్కడ నుంచి వీరభద్రరావు పారిపోయి ఇంటికి వెళ్ళిపోయాడు. తన భార్య అరుణ సాయంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చి వైద్యులకు చెప్పడంతో ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏలూరు రూరల్ పోలీసులు తెలిపారు.

కొల్లేరు.. కొల్లగొట్టు !

5వ పేజీ తరువాయి

ఆక్రమించడం వల్ల పైనుంచి వచ్చే మురుగు పూర్తిస్థాయిలో కొల్లేరు సరస్సులోకి వెళ్లక ఎగదన్నుతోంది. ఆరుకాలం కష్టపడి వ్యవసాయం చేసుకుంటున్న రైతులు తమ చేలల్లో మురుగునీరు కిందకు వెళ్లకపోవడంతో కొన్నేళ్ళుగా ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఇటీవల రొయ్యల చెరువుల సాగు పెరగడంతో మురుగునీరు కాల్వలన్నీ ఉప్పు నీటిమయం కావడంతో రైతులు వేసిన వరి పంట బతకడం లేదని ఆందోళన చెందుతున్నారు. సంప్రదాయ వ్యవసాయం చేసుకునే రైతులు తమ పొలాల నుంచి మురుగునీరు పోయే కాల్వలను బాగు చేయమని ఎన్నో ఏళ్లుగా ప్రజా ప్రతినిధులకు మొర పెట్టుకుంటున్నారు. కానీ ప్రజా ప్రతినిధులు ఈ విషయంపై శ్రద్ధ పెట్టకపోవడంతో రైతులు తమ పొలాలను సాగు చేయలేక బీడు భూములుగా వదిలి వేశారు. ఇదే అదను కోసం చూస్తున్న మాఫియా మధ్యవర్తులసాయంతో వారిపై ఒత్తిడి తెచ్చి అక్రమ చెరువుల తవ్వకాలకు తెర లేపుతున్నారు. నూతన ప్రభుత్వమైనా కొల్లేరు కాంటూరు భూముల విషయమై సమగ్రసర్వే సమస్య పరిష్కరించాలని ప్రజలు వేడుకుంటున్నారు. తమ భూముల్లో సంప్రదాయ వ్యవసాయ సాగుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కొల్లేరుకు పూర్వ వైభవం తీసుకొచ్చి పర్యావరణం కాపాడాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

పశ్చిమకు నాగరాణి.. ఏలూరుకు వెట్రిసెల్వి

కుప్పంలో తన సమర్థతను చాటుకున్నారు. కుప్పం స్పెషల్ ఆఫీసర్‌గా అందరి మన్ననలు అదుకున్నారు. మదనపల్లె సబ్ కలెక్టర్‌గా తనదైన శైలిలో రాణించారు. నెల్లూరు జాయింట్ కలెక్టర్‌గా వ్యవహరించారు. సర్వశిక్ష అభియాన్ డైరెక్టర్‌గా కొన్నాళ్లపాటు పనిచేశారు. జగన్ హయాంలో పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం అభివృద్ధికి ప్రత్యేకాధికారిగా సెల్వి సేవలను వినియోగించుకున్నారు. తాజాగా మహిళా శిశు శాఖ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఏ పోస్టులో ఉన్నా సమర్థవంతమైన అధికారిణిగా ఆమె పేరు తెచ్చుకున్నారు. అందుకనే చంద్రబాబు సెల్విని ఏలూరు జిల్లా కలెక్టర్‌గా నియమించారు. ప్రసన్న వెంకటేశ్ 2022 జనవరిలో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి రెండున్నరేళ్లపాటు పనిచేశారు. చాన్నాళ్ల నుంచి ఆయన బదిలీ తప్పకపోవచ్చని ఆంధ్రజ్యోతి ముందుగానే అంచనా వేసింది. దీనికనుగుణంగా ఆయన బదిలీ అయ్యారు.

శ్రీవారికి జ్యేష్ఠ అభిషేకం



పాలకొల్లు అర్బన్, జూన్ 22 : స్థానిక 24వ వార్డులోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి జ్యేష్ఠమాసం పురస్కరించుకుని ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి జీడిమామిడి పండ్లు నివేదించారు.

నేడు చినమావుళ్ళమ్మ జాతర

భీమవరం టౌన్, జూన్ 22 : టూటౌన్‌లోని రామరాజు తోటలో మావుళ్ళమ్మ అమ్మవారి 39వ జాతర ఆదివారంనాడు ప్రారంభం కానున్నది. మావుళ్ళమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఆరు రోజులపాటు వైభవంగా నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షురాలు రామాయణం వెంకట లక్ష్మీ తులసీపార్వతీ, కార్యదర్శి రేవూరి గోగురాజు తెలిపారు. ఆదివారం ఉదయం 8-10 గంటలకు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రారంభిస్తారు.

ఆయుర్వేద వనమూలికలపై అవగాహన

ఆకివీడు, జూన్ 22: సర్వ రోగాల నివారిని ఆయుర్వేద వైద్యమని డాక్టర్ బి.శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆర్యవైశ్య కళ్యాణ మందిరంలో ఆర్యవైశ్య సంఘం, ఆదర్శ లయన్స్ క్లబ్ నేతృత్వంలో ఆయుర్వేద వనమూలికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆహార నియమాలు పాటించకపోవడం వల్లనే రోగాలు బారిన పడుతున్నారన్నారు. చిన్న రోగాలన్నిటికీ మన ఇళ్ళలోని వంటింట్లో లభించే జీలకర్ర, వాము,మెంతులు తదితర వాటితో రోగాలను బాగుచేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గొంట్లా గణపతి, చొప్పెర్ల శ్రీరామచంద్ర మూర్తి, సన్నిధి వెంకన్న, నేరెళ్ళ రామ చెంచయ్య, ఎం.శ్రీను, అహ్మద్, మోరా జ్యోతిరెడ్డి, నాగమణి, బొమ్మా రెడ్డి మాధవరెడ్డి పాల్గొన్నారు.

సంఘ సేవకులకు సత్కారం

పాలకొల్లు అర్బన్, జూన్ 22: స్థానిక హరివిల్లు సేవా సంస్థ ఆధ్వర్యంలో సమాజ సేవకులు బుద్దాల వెంకట రామారావు, గట్టిం మాణిక్యాలరావును ఘనంగా సత్కరించారు. లయన్స్ క్లబ్ భవనంలో శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమానికి సంస్థ అధ్యక్షుడు వంగా నరసింహారావు అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి వెంకట రత్నం సంధాన కర్తగా వ్యవహించారు. రోటరీ అధ్యక్షుడు పెనుమాక రామ్మోహన్, ఎన్‌విఎవిఎస్ పాపారావు నాయుడు, నటీ నట సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షుడు గుడాల హరిబాబు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్నేన రోజారమణి, జవ్వాది దాసరథి, గుండా రామకృష్ణ, మేడికొండ రామదాసు, ఉద్దరాజు పెద్దిరాజు, శివాల రామారావు, కొల్లి కొండ ప్రసాద్, చేగొండి రంగారావు, గంటా ముత్యాలరావు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు ధర్మారావు ఫౌండేషన్ సాయం

పాలకొల్లు రూరల్, జూన్ 22: భగ్గేశ్వరంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన రెండు కుటుంబాలవారిని జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పరామర్శించి, తన తండ్రి పేరుతో ఉన్న ధర్మారావు ఫౌండేషన్ ద్వారా సహాయం అందిస్తానని ఇచ్చిన హామీ మేరకు శనివారం ఫౌండేషన్ సభ్యులు నిత్యావసర సరుకులు, బియ్యం, వంట సామగ్రి, దుస్తులను అందజేశారు.

కాపవరంలో రాష్ట్ర నాయకుల చిత్రాలు ఏర్పాటు

పాలకొల్లు రూరల్, జూన్ 22: కాపవరం పంచాయతీలో రాష్ట్ర నాయకుల ఫొటోలు ఏర్పాటు చేశారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, జలవనుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చిత్రపటాలను ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సందర్భంగా కూటమి నాయకుల ఫొటోలు ఏర్పాటు చేయడం జరిగిందని సర్పంచ్ కోలాటి రాధ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంగర వీర భద్రకుమార్ (చిన్న) పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

పాలకొల్లు రూరల్, జూన్ 22 : పాలకొల్లు రూరల్ పంచాయతీ పెద గరువులోని ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 44 మంది విద్యార్థులకు పట్టణంలోని పానకాల రాయ రామమోహన్ క్లబ్ ద్వారా నోట్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జీవీవీ సత్యనారాయణ, కోశాధికారి చోడిశెట్టి జ్ఞానశంకర్, హెచ్ఎం నిల్లా సురేష్ బాబు, రాయపూడి భవానీ శంకర ప్రసాద్, పంపన లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

ఆచంట: ఆచంట వేమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, విద్యా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి, వైస్ ఎంపీపీ యర్రగొప్పుల నాగరాజు, తాళం శ్రీనివాస్, ఎంపీటీసీ గుడాల లక్ష్మీదుర్గ పాల్గొన్నారు.

నరసాపురం రూరల్: మండలంలోని మల్లవరం, రుస్తుంబాదా, పసలదీవి, వేములదీవి గ్రామాల్లోని పలు ప్రభుత్వ స్కూళ్ళల్లో శనివారం విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రాధాకృష్ణ, సర్పంచ్‌లు వెంకట్, జి.సుజాత, ఒడుగు ఏసు, బీజేపీ నాయకులు పండు పాల్గొన్నారు.

కాళ్ల(ఉండి): కాళ్ల మండలం వేంపాడు హిందూ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, కిట్స్‌ను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన దాతలు కోసూరి సత్యనారాయణరాజు, సర్పంచ్ యిర్రింకి పద్మావతి శ్రీనివాస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రూ.14వేల విలువైన నోట్ బుక్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బిఎస్.మురళీశ్రీనివాస్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు వీరమల్లు వేణుమాధవ్, జనసేన అధ్యక్షుడు వెంకటేష్, వాసవీక్లబ్ సభ్యులు, రజక సంఘం అధ్యక్షులు బాల, ఉపాధ్యాయులు వరలక్ష్మీ, కిషోర్ పాల్గొన్నారు.

అత్తిలి: కొమ్మర గ్రామంలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ, హెచ్ఎం నూకరాజు, టీడీపీ నాయకులు ముదునూరి బాల కృష్ణంరాజు, ఆల్తి సత్యనారాయణ, కొరిపల్లి హరి, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

మూగజీవాలపై ప్రేమ కలిగి ఉండాలి

గణపవరం, జూన్ 22: ప్రతి ఒక్కరూ మూగజీవాల పట్ల ప్రేమ కలిగి ఉండాలని పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ డీఎం నాయక్ కోరారు. అర్ధవరం జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం జంతువుల హక్కుల పరిరక్షణ చట్టంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించి, పలు అంశాలు వివరించారు. డాక్టర్ బి.నాగజ్యోతి మాట్లాడుతూ జంతువులను హింసిస్తే జంతు సంక్షేమ చట్టం 1960ద్వారా శిక్షిస్తారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు అడ్డేపల్లి వాసురాజు, హెచ్ఎం సీహెచ్.ప్రసన్నాంజనేయులు, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.





స్పీకర్ అయ్యన్నపాత్రుడును అభినందిస్తున్న ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు, మాజీ ఎమ్మెల్సీ అంగర.. మంత్రి గొట్టిపాటిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

మంత్రులను కలసిన జిల్లా ప్రజా ప్రతినిధులు

పాలకొల్లు అర్బన్, జూన్ 22 : రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఎన్ఎండి ఫరూక్‌ను మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ శనివారం మంత్రి ఛాంబర్‌లో కలిసి అభినందించారు. గతంలో తాను ఎమ్మెల్సీగా మండలిలో ఉన్న సమయంలో మండలి చైర్మన్‌గా, మంత్రిగా పనిచేసిసన సంఘటనలు ఈసందర్భంగా గుర్తు చేసుకున్నారు. అదే విధంగా స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన చింతకాయల అయ్యన్న పాత్రుడును కలిసి శుభాకాంక్షలు తెలిపినట్టు అంగర ఫోన్‌లో తెలిపారు.

తణుకు: ఏపీ సెక్రటేరియట్‌లో పలువురు మంత్రులను తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. శనివారం జల వనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు.

ఉండి: సచివాలయం వద్ద స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి అచ్చన్నాయుడులను ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శనివారం సచివాలయంలో వున్న వారిని ఎమ్మెల్యే రఘు వారి వద్దకు వెళ్లారు. వారంతా కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న ఆయా పనుల తీరును చర్చించుకున్నారు.

ప్రభుత్వం దృష్టికి ఆక్వా రైతుల సమస్యలు

పాలకొల్లు అర్బన్, జూన్ 22 : జైభారత్ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో జూలై 3వ తేదీన ఆక్వా రైతు సభ ఏర్పాటు చేస్తున్నట్టు సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు తెలిపారు. చందపర్రులోని త్రిబుల్ ఎస్‌కళ్యాణ మండపంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశానికి భగవాన్‌రాజు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈసందర్భంగా భగవాన్‌రాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆక్వా రైతుల పట్ల ప్రాసెసింగ్ యూనిట్లు, సీడ్ యజమానులు, ఫీడ్ కంపెనీలు వివక్ష చూపుతున్నాయని, తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం నిమిత్తం నూతనంగా రాష్ట్రంలో ఏర్పాటు అయిన ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలు పరిష్కారానికి గానూ జూలై 3వ తేదీన 10వేల మంది రైతులతో భారీ ఎత్తున ఆక్వా రైతులతో సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

అరుణాచలం సేవలు ఎనలేనివి.....



అరుణాచలం విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న గ్రీన్ ఆర్మీ సభ్యులు

ఆచంట, జూన్ 22: ఆచంట వేమవరం మాజీ సర్పంచ్ మల్లంపల్లి అరుణాచలం సేవలు ఎనలేనివని గ్రీన్ ఆర్మీ సభ్యులు బాలం శ్రీనివాస్ తెలిపారు. అరుణాచలం 79వ జయంతి వేడుకలను ఆచంట వేమవరంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి గ్రీన్ ఆర్మీ సభ్యులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాధవ శర్మ, మేడిద నాగరాజు, కేశవులు, వైవీ సత్యనారాయణ, కొల్లి నాగేశ్వరరావు, గణేష్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న ఇన్‌చార్జి పొత్తూరి

నరసాపురం టౌన్, జూన్ 22: టీడీపీ మండల అధ్యక్షుడు వాతాడి జన్మదిన వేడుకను పురస్కరించుకుని శనివారం అన్నదానం నిర్వహించారు. బస్టాండ్ సమీపంలోని చిన్న కనకదుర్గా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదానాన్ని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు ప్రారంభించి పేదలకు అన్నం వడ్డించారు. ఆకన సుబ్రహ్మణ్యం, సంకు భాస్కర్, నల్లూరి సూర్యనారాయణ, పెద్దిరాజు, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు తొమ్మిది వినతులు

నరసాపురం, జూన్ 22: ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎంకు తొమ్మిది వినతులు వచ్చాయి. డీఎం సుబ్బన్నరెడ్డి ప్రయాణికుల నుంచి ఫోన్ ద్వారా వారి సమస్యలు, వినతులు విన్నారు. గతంలో నరసాపురం డిపో నుంచి దొడ్డిపట్ల మీదుగా రాజమండ్రి ఉండేదని, మళ్లీ ఆ సర్వీస్‌ను పునరుద్ధరించాలని ప్రయాణికుడు కోరారు. నరసాపురం డిపో నుంచి మత్స్యపురి నుంచి టీపీగూడెంకు సర్వీస్ నడపాలని కోరారు. ఈకార్యక్రమంలో ఆర్టీసీ టీసీ వర్మ పాల్గొన్నారు.

దుకాణాలకు ఆసక్తి చూపని పాటదారులు

నరసాపురం, జూన్ 22: పట్టణంలో పురపాలక సంఘానికి చెందిన కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న 43 దుకాణాలకు శనివారం కమిషనర్ వెంకటేశ్వరావు అధ్యక్షతన వేలం పాట నిర్వహించారు. అయితే కేవలం మూడు దుకాణాలను పాడుకునేందుకు మాత్రమే పాటదారులు ముందుకొచ్చారు. మిగిలిన దుకాణాలను వేలంలో దక్కించుకుని అద్దెకు తీసుకునేందుకు మిగిలిన వారెవ్వరూ ముందుకు రాలేదు. దీంతో వేలం పాటను రద్దు చేశారు. పాడుకున్న ముగ్గురికి కౌన్సిల్ ఆమోదంతో షాపుల్ని అప్పగించనున్నారు. ఆర్ఐ నానాజీ పాల్గొన్నారు.

మురుగు బోదెల ప్రక్షాళన



గొల్లలకోడేరులో మురుగు బోదెల ప్రక్షాళన పర్యవేక్షిస్తున్న టీడీపీ నాయకులు

పాలకోడేరు, జూన్ 22: గొల్లలకోడేరులో ఐదేళ్ళ కాలంగా పూడుకుపోయిన మురుగు బోదెలకు గ్రామ టీడీపీ అధ్యక్షుడు కమ్మిలి రాంబాబు ఆధ్వర్యంలో ప్రక్షాళన ప్రారంభమైంది. గొల్లలకోడేరులో ఏ వీధిలో చూసిన మురుగు బోదెలు పూడుకుపోయి ఉండటంతో ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోతుంది. దీంతో ఆయా ప్రాంతాల వారు మురుగు వెళ్ళే దారిలేక తీవ్ర ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో పార్టీ నాయకులకు బలం చేకూరింది. ఇప్పటి వరకు గ్రామాల్లో వైసీపీ సానుభూతిపరులే ఉండటం వలన గ్రామాల అభివృద్ధి కుంటుపడింది. ఇప్పుడు గొల్లలకోడేరు గ్రామంలో కమ్మిలి రాంబాబు మురుగు బోదెల ప్రక్షాళనకు నడుం బిగించారు. గ్రామంలోని అన్ని బోదెలను ఎక్స్‌కవేటర్లు ఏర్పాటు చేసి మురుగు పారే విధంగా పనులు చేపడుతున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గాదిరాజు సూర్యనారాయణరాజు, కామన రాంబాబు, బత్తిన నాగేశ్వరరావు, సంబలదీవి వెంకటేశ్వరరావు, కొండపల్లి ఏసురత్నం, తంగెళ్ళ సత్యనారాయణ, శ్రీను, వెంకటేష్, నరసింహరాజు పర్యవేక్షిస్తున్నారు.

జంతువులపై అవగాహన

పాలకోడేరు, జూన్ 22: విస్సాకోడేరులోని ప్రైవేటు పాఠశాలలో జంతుహక్కుపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని మండల పశువైద్యాధికారి డాక్టర్ హేమ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమ మాట్లాడుతూ జంతువులను ప్రేమతో పెంచుతూ వాటి ప్రాథమిక హక్కులు అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. జంతువుల నుంచి లభ్యమయ్యే ఉత్పత్తులు, వాటి కారణంగా కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పశుసంవర్థక శాఖ సిబ్బంది జయలక్ష్మి, పోతురాజు, శివన్నారాయణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యాలను సాధిస్తేనే ఫలితాలు

భీమవరం ఎడ్యుకేషన్, జూన్ 22 : వర్క్‌షాప్‌లలో అధ్యయనం చేసిన అంశాలు ఆచరణలో వాటిని వాస్తవ రూపంలోకి తీసుకురాగలిగితే మంచి ఫలితాలు వస్తాయని తమిళనాడులోని త్యాగరాజర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆర్అండ్‌డీ డీన్ డా. ఎస్ భాస్కర్ అన్నారు. ఎఫెక్టివ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ అవుట్‌పుట్ కంబెస్ట్ ఎడ్యుకేషన్ అనే వర్క్‌షాప్ శనివారం ఎస్ఆర్‌కేఆర్‌లో ముగిసింది. ఐక్యూ ఏసీ డీన్ వర్క్‌షాప్ కోఆర్డినేటర్ డా.ఎస్ రాజేష్ అధ్యక్షతన డా.భాస్కర్ అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా నూతన అంశాలు అధ్యాపకులకు బోధించిన డా.భాస్కర్‌ను కళాశాల తరుపున ప్రిన్సిపాల్ డా.కెవి మురళీకృష్ణంరాజు ఘనంగా సత్కరించారు.

నందమూరు ప్రధాన రహదారి శుభ్రం



తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 22: తాడేపల్లిగూడెం మండలం నందమూరులో తాడేపల్లిగూడెం -నిడదవోలు ప్రధాన రహదారిని సర్పంచ్ శనగన వరలక్ష్మి ఆధ్వర్యంలో తుప్పలు తొలగించి శుభ్రం చేశారు. జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు వాహన చోదకులకు ఇబ్బంది లేకుండా శుభ్రం చేశారు.

గ్రామాల్లో ఉపాధి పనులు



మొగల్తూరు, జూన్ 22: మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మొగల్తూరు పంచాయతీ నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం, పాలకమ్మచెరువు, కెపి పాలెం నార్త్, సౌత్, పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాల్లో పంటబోదెల తవ్వకం పనులు చేశారు. ఈ పనులను జేఈ ఆనంద్, టిఏ వెంకటేశ్వరరావు పరిశీలించి తవ్వకం పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కూలీలకు సూచించారు.

సార్వాకు సమాయత్తం కావాలి



మొగల్తూరులో దుక్కి దున్నేందుకు సిద్ధమైన చేను

మొగల్తూరు, జూన్ 22: రైతులు సార్వా సాగుకు సమాయత్తం కావాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ కోరారు. కాలువలు వదిలినందున ఆకుమడులు వేసుకునేందుకు సిద్ధం కావాలన్నారు. పొడి విత్తనాలు ఒక కిలోకు 3 గ్రాముల కార్బెండిజం, తడి విత్తనాలకు 4 గ్రాముల కార్బెండిజంను కలిపి విత్తన శుద్ధి చేయాలన్నారు. మండలంలో 17 గ్రామాలకు సంబంధించి 980 ఎకరాల్లో సార్వా సాగు చేపడతారని అంచనా వేస్తున్నామన్నారు. సార్వా సాగుకు ఎంటీయూ స్వర్ణ 7029, 1061, ఇంద్ర 1064, అమర 1262, మార్టేరు పసూరి, ఎంటీయూ 1318 శీతాకాలం సన్నాలు వినియోగించుకోవాలన్నారు. లోతట్టు పంట చేలకు 1100 బాడవ మసూరి, ఎంటీయూ 1140 బీమా ఎంటీయూ 1064, అమర ఎంటీయూ 1172, 1318 వంటి రకాలు అనుకూలంగా ఉంటాయన్నారు. చవుడు భూములకు ఎంటీయూ 1293, ఎంసీయూ 103 వంటి విత్తనాలు అనుకూలంగా ఉంటాయన్నారు.

వాసవి సేవా కార్యక్రమాలు



హోమ్ గార్డును సన్మానిస్తున్న వాసవి వనితా క్లబ్ ప్రతినిధులు

మొగల్తూరు, జూన్ 22: మొగల్తూరు వాసవి వనితాక్లబ్ ఆధ్వర్యంలో శనివారం మొగల్తూరులో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ విజిట్‌ను పురస్కరించుకుని మొగల్తూరు షిరిడి సాయి ఆలయానికి రూ.10 వేలు విలువ గల వాటర్ ట్యాంకర్‌ను, ఆలయంలో అన్న సమారాధనకు ఒక బస్తా బియ్యం, గుడి గంట, మంచినీటి పైప్ లైన్‌తో పాటు వృద్ధులకు చేతి కర్రలు, విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించారు. సమాజంలో రక్షణ కల్పిస్తున్న పోలీసులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ జల్లూరి రమేష్, కారుమూరి శ్రీరాములు, రివిజినల్ చైర్మన్ చెక్కా శ్రీనివాసరావు, జోన్ చైర్మన్ శ్యామల, అధ్యక్షురాలు గుండు లక్ష్మీ కుమారీ, కార్యదర్శి సీమకుర్తి అరుణ, కోశాధికారి మంగామణి, కారుమూరి రత్నకుమారి, జిఎన్ విఆర్ లక్ష్మీ, నాగదుర్గా ప్రభావతి పాల్గొన్నారు.

ఆక్రమిత భూమి స్వాధీనం

పెనుగొండ, జూన్ 22: వడలి గ్రామంలో ఆక్రమణకు గురైన శ్మశాన స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్టు పంచాయతీ కార్యదర్శి పి.అచ్యుత రామకృష్ణ తెలిపారు. వడలి శ్మశాన వాటికలో ఆక్రమణకు గురైందని స్పందనలో వచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ సిబ్బంది శ్మశాన వాటికను సర్వే చేసి హద్దులు నిర్ణయించడం జరిగిందన్నారు. ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకుని శుభ్రం చేసే పనులు చేపట్టడం జరిగిందన్నారు.

ఇటుకల తరలింపు అడ్డగింత

ఆచంట, జూన్ 22: కొడమంచిలి గ్రామంలో నిర్మిస్తున్న సచివాలయం 1 వద్ద ఉన్న ఇటుకను దౌర్జన్యంగా తరలించుకుపోతున్న వైసీపీ నాయకులను కూటమి నాయకులు అడ్డుకున్నారు. అడ్డుకున్నవారిలో చిలుకూరి శ్రీను, బాలం రమణ తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న గజల్స్ శ్రీనివాస్ గానలహరి



తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 22: తెలుగు సాహితీ సమాఖ్య స్వర్ణోత్సవాల సందర్భంగా తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాకేంద్రం వద్ద శనివారం నిర్వహించిన గానలహరి ఆకట్టుకుంది. గజల్స్ శ్రీనివాస్‌కు అవార్డు ప్రదానోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గజల్స్ శ్రీనివాస్ గానాలాపన, శ్రీ డాన్స్ అకాడమీ విద్యార్థుల నృత్యాలు ఆహుతులను అలరించాయి. సమాఖ్య అధ్యక్షుడు మండా బ్రహ్మాజీ, ప్రధాన కార్యదర్శి పైలు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాకేంద్రం అధ్యక్షుడు బుద్దాల రామారావు, వాసవి ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరంలో అగ్నిప్రమాదం

వీరవాసరం(భీమవరం టౌన్) జూన్ 22 : వీరవాసరంలోని మసీదు సెంటర్‌లో శనివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నది. గాయత్రి టీ, టిఫిన్ సెంటర్‌లో జరిగిన ఈ ప్రమాదంలో వంట సామగ్రి, ఫ్రిడ్జి, గృహోపకరణాలు కాలిపోయాయి. రెండు లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని హోటల్ యజమాని వీరవల్లి నరసింహస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఉండి, జూన్ 22: యండగండి పంచాయతీ పరిధిలోని రాయనివానిగూడెంనకు చెందిన కాలా గణేష్, తంగెళ్ల వెంకటేశ్వరరావులు పాత గొడవలు పురస్కరించుకుని ఒకరికొకరు గొడవపడ్డారు. వీరి ఇరువురు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఉండి ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

నిల్వ మాంసం ఇచ్చాడని ఆందోళన

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 22: నిల్వ ఉన్న కోడి మాంసాన్ని అమ్మాడని బాధితుడు ఆందోళన చేపట్టిన ఘటన తాడేపల్లిగూడెంలో శనివారం చోటుచేసుకుంది. రామారావుపేటకు చెందిన మహ్మద్ అలీ పెద్ద మసీదు వద్ద ఒక దుకాణంలో శనివారం రూ.400లకు కోడి మాంసం కొనుగోలు చేశాడు. అయితే ఇంటికి వెళ్లి చూసేసరికి మాంసం దుర్వాసన రావడంతో దుకాణదారుడిని అడగగా అతను దురుసుగా మాట్లాడాడని బాధితుడు మున్సిపల్ కార్యాలయ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లాడు. అయితే అది తమ పరిధిలోకి రాదని చెప్పినట్టు సమాచారం.

లక్ష్మీగణపతి హోమం

భీమవరం టౌన్, జూన్ 22: పౌర్ణమి సందర్భంగా మెంటేవారితోటలోని శ్రీబాలత్రిపుర సుందరిదేవి అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, లక్ష్మి గణపతి హోమాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో బొలిశెట్టి వీర వెంకట నాగేశ్వరరావు, రంగమాంబ దంపతులచే ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి కుంకుమ పూజలు, పంచామృతాలతో అభిషేకాలను వేదమంత్రాలతో నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో సంప్రదాయ బద్దంగా లక్ష్మి గణపతి హోమం నిర్వహించారు.

మావుళ్లమ్మకు.. చండీ హోమం



భీమవరం టౌన్, జూన్ 22: పౌర్ణమి సందర్భంగా మావుళ్ళమ్మ ఆలయంలో శనివారం చండీహోమం జరిగింది. ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ, వేద పండితులు నిర్వహించగా, 87 మంది దంపతులు పాల్గొన్నారు. అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ పాల్గొన్నారు.

పెంట్లమ్మకు ప్రత్యేక పూజలు



పెంటపాడు, జూన్ 22: పౌర్ణమి సందర్భంగా కె.పెంటపాడు గ్రామదేవత పెంట్లమ్మ అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అమ్మవారిని దర్శించుకోగా ఆయనను ఆలయ కమిటీ అధ్యక్షుడు పంతం శేఖర్ సత్కరించారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనకు ఆదిరెడ్డి సన్యాసిరావు కుమార్తె సౌమ్యచందన పుట్టిన రోజు సందర్భంగా రూ. 50,116లు, ముత్యాల శ్రీరామదుర్గ సూర్యనారాయణ రూ. 5116లు విరాళంగా అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గంధం సతీష్, సర్పంచ్ పీతల సత్యనారాయణ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలసిన కార్మిక సంఘాలు

భీమవరం టౌన్, జూన్ 22 : బీఎంఎస్, బీహెచ్ఈఎల్ కార్మిక సంఘం ప్రతినిధులు, కార్మిక సంఘ నాయకులు శనివారంనాడు కేంద్ర ఉక్కు,భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మను భీమవరంలోని ఆయన స్వగృహంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. 12 సంవత్సరాలుగా ఆగి ఉన్న వేతన సవరణ విషయంపై, రా మెటీరియల్ అందుబాటు కోసం ప్లాంట్‌ను ఎన్ఎండీసీ లేదా సెయిల్‌లో కలిపే విషయంపైన ఈఎంఐ లోన్ ఇంట్రెస్టులను సంవత్సరం పాటు మారిటోరియం విధించడానికి సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో బీఎంఎస్ జనరల్ సెక్రెటరీ రామస్వామి, బీఎంఎస్ ప్రెసిడెంట్ హరీష్ వర్మ పాల్గొన్నారు.

మల్లినీడి అభినందనలు



భీమవరంటౌన్, జూన్ 22 : రాష్ట్ర నూతన డీజీపీగా నియమితులైన సీహెచ్ ద్వారకా తిరుమల రావును వారి కార్యాలయంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రొటోకాల్ చైర్మన్ మల్లినీడి తిరుమల రావు (బాబి) గౌరవ పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు.



పాలకొల్లులో దేవల మహర్షి జయంతి వేడుకలు

ఘనంగా దేవల మహర్షి జయంతి

పాలకొల్లు టౌన్, జూన్ 22: పాలకొల్లు పట్టణ దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక వీవర్స్ కాలనీలోని సంఘ భవనంలో శనివారం దేవాంగ కుల వంశ మూలపురుషుడు దేవల మహర్షి జయంతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. మహర్షి జయంతిలో భాగంగా పూజా కార్యక్రమాలు, జ్యోతి ప్రజ్వలనను వేడుకగా నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా దేవాంగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు పట్టం గణేష్ మాట్లాడుతూ సృష్టిలోనే మొదటగా వస్త్ర సూత్రదారి దేవల మహర్షి అనీ, భావితరాలకు తెలయజేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

నరసాపురం టౌన్: పట్టణంలోని 12వ వార్డులో చౌడేశ్వరిదేవి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం దేవల మహర్షి జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేవాల మహర్షిస్వామి చరిత్రను ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు.

రహదారి సమస్యలు పరిష్కరించండి



ఆర్అండ్‌బీ అధికారి నయీముల్లాకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 22: అమరావతిలో ఆర్ అండ్‌బీ అధికారి నయీముల్లాను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. నియోజకవర్గం రోడ్ల సమస్యలను, ఆగిపోయిన టెండర్లను త్వరగా పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.

ధాన్యం సొమ్ము తక్షణం చెల్లించాలి

పెంటపాడు, జూన్ 22: ధాన్యం బకాయి సొమ్ము త్వరితగతిన చెల్లించాలంటూ రైతు సంఘం, సీఐటీయూ నాయకులు చిర్లా పుల్లారెడ్డి, సిరపరపు రంగారావు డిమాండ్ చేశారు. శనివారం పెంటపాడు సచివాలయం వద్ద రైతులతో కలసి నిరసన తెలిపారు. సొమ్ము రాకపోవడంతో సార్వా పెట్టుబడులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెనగంటి దుర్గ, వీరాబత్తుల దానయ్య, మామిడిచెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

భీమవరం టౌన్, జూన్ 22 : జంతు సంరక్షణ ప్రతిఒక్కరి నైతిక బాధ్యత అని, జంతువులను హింసిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ డా కే మురళీకృష్ణ అన్నారు. సీఎస్ఎన్ కళాశాలలో ప్రపంచ జంతు హక్కుల పరిరక్షణ వారోత్సవాలలో భాగంగా కళాశాల కార్యదర్శి చిడే సత్యనారాయణ అధ్యక్షతన సదస్సు ర్యాలీ నిర్వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ జంతువుల సంక్షేమం కోసం ప్రభుత్వం జంతు హింస నివారణ చట్టం తెచ్చిందని, ఆ చట్టాన్ని ప్రతి పౌరు డూ తప్పక తెలుసుకోవాలన్నారు. పశు సంవర్థక శాఖ ఉప సంచాలకులు డా జాఫర్ హుస్సేన్ మాట్లాడుతూ జంతువులు, పక్షులను, నీటిలో జీవించే జీవులను హింసించినా చట్టప్రకారం జంతు సంక్షేమ బోర్డు శిక్షిస్తుందని, జంతువుల పట్ల జాలి, దయ, కరుణ చూపాలని, ఆహారం, తాగునీరు అందించాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా రోగనిరోధక మాత్రలు వేయించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నకుమళ్ళ సత్యనారాయణ, నరహరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

కూటమి విజయం ప్రజలందరిదీ

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 22 : రాష్ట్రంలో కూటమి విజయం ప్రజా విజయమని టీడీపీ జిల్లా కార్యదర్శి ముద్దుకూరి ధనరాజు అన్నారు. శనివారం నవాబుపాలెంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో వైసీపీ పాలనలో నిలిచిన పనులను చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని సర్పంచ్ ముద్దుకూరి గంగాభవాని పేర్కొన్నారు. ఎంపీటీసీ బండి వెంకట లక్ష్మి, జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, టీడీపీ అధ్యక్షుడు కొండేటి వెంకటేశ్వరరావు, బీజేపీ గ్రామ అధ్యక్షుడు బండి సూరిబాబు, జనసేన గ్రామ అధ్యక్షుడు బండి శివనాయుడు తదితరులు పాల్గొన్నారు.